# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 48 28-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06







## ఈ ఏడాది చివరికి
# 10 లక్షల పైగా గృహ ప్రవేశాలు జరిపిస్తాం

**ఈ ఏడాది డిసెంబర్ నాటికి 10 లక్షల ఇళ్లు లబ్ధిదారులకు అందజేత**

- నిరుపేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం ఉచితం
- రైతు సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయాభివృద్ధికి ఐదు సూత్రాల అమలు
- లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు
- ఏలూరులో ప్రపంచంలోనే అతిపెద్ద కోకో సిటీ ఏర్పాటు



రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నేడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గృహ నిర్మాణం, వ్యవసాయ శాఖల పద్దులపై జరిగిన చర్చలో సీఎం ప్రసంగించారు. ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 10 లక్షలకు పైగా ఇళ్లకు గృహ ప్రవేశాలు జరిపిస్తామని ఆయన సభలో ప్రకటించారు. ఇప్పటికీ ఇళ్లు లేని నిరుపేదలు ఎవరైనా ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఏ ఒక్క పేద కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే తమ ధ్యేయమని సీఎం తెలిపారు. రాయచోటి నుంచి ఇప్పటికే 3 లక్షల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించామని, ఈ ఏడాది ఉగాది నాటికి దాదాపు 3 లక్షల ఇళ్లలో లబ్ధిదారులు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జూన్ నాటికి మరో 2.26 లక్షలు, సెప్టెంబర్ నాటికి ఇంకో 2.10 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు పూర్తి చేస్తామని స్పష్టమైన ప్రణాళికను వివరించారు.

# ఇక కోర్ అర్బన్ చట్టం



- జీహెచ్‌ఎంసీ చట్టం స్థానంలో తయారు చేయాలని అధికారులకు ఆదేశం
- అన్నింటికీ ఆ చట్టమే ఆధారంగా ఉండాలని సూచన.. కోర్ ఏరియాలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలి
- ఓఆర్ఆర్ లోపల రోడ్లలన్నింటినీ పురపాలక శాఖ పరిధిలోకి తేవాలి
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: ఔటర్ రింగురోడ్డు పరిధిలోని (కోర్ అర్బన్) మూడు మున్సిపల్ కార్పొరేషన్లకు వర్తించేలా (గ్రేటర్ హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ) చట్టం స్థానంలో కోర్ అర్బన్ చట్టాన్ని తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అనుమతులు, రుసుములు, అభివృద్ధి పనుల నిర్వహణ, ఇతర వ్యవహారాలన్నింటికీ ఆ చట్టమే ఆధారంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 99 రోజుల కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలో చేపట్టే పనులు తొలుత చేపడతామని సీఎం తెలిపారు. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖపై రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కోర్ అర్బన్ ఏరియాలో పారిశుధ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పలు ప్రాంతాల్లో చెత్త ఎక్కడ వేయాలో తెలియక ప్రజలు ఖాళీ ప్రదేశాల్లో వేస్తున్నారని, ముందుగా చెత్త వేయాల్సిన ప్రాంతాలను గుర్తించి అక్కడ బోర్డులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం పేర్కొన్నారు.

- మిగతా 2వ పేజీలో

## మావోయిస్టు నేతల లొంగుబాటుపై అసెంబ్లీలో ప్రకటన చేస్తా

- చట్టపరిధిలో వారు ఏమైనా చేసుకోవచ్చన్న ముఖ్యమంత్రి
- చట్టాలను ఉల్లంఘిస్తే మాత్రం ప్రభుత్వం తన పని తాను చేస్తుందని వ్యాఖ్య
- ప్రస్తుత పరిస్థితుల్లో తుపాకీ పట్టుకుంటే నడవదని మాజీ మావోయిస్టు కీలక వ్యాఖ్య

2లో



## ఏపీలో పాలు, నీళ్లు కూడా ప్రాణాంకతమే

- చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వరుస మరణాలని జగన్ ఆరోపణ
- శ్రీకాకుళం, రాజమండ్రి ఘటనలతో డజనుకు పైగా మృతి చెందారని వెల్లడి
- గత 14 నెలల్లో 900 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆవేదన
- ప్రభుత్వం వెంటనే మేల్కొని చర్యలు చేపట్టాలని డిమాండ్

2లో

## బస్తీల బాట పట్టిన కిషన్ రెడ్డి

- బౌద్ధనగర్, సీతాఫల్‌మండి, మెట్టుగూడ డివిజన్లలో పర్యటించిన కిషన్ రెడ్డిబస్తీ వాసుల కష్టాలను అడిగి తెలుసుకున్న కేంద్ర మంత్రి
- మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దని అధికారులకు ఆదేశం





## అఫ్గానిస్తాన్‌పై పాక్ దాడులు

- ‘ఆపరేషన్ గజబ్ లిల్ హక్’లో 274 మంది తాలిబన్లు మృతి..
- 400 మందికి గాయాలు
- తాలిబన్ల దాడులను తిప్పికొట్టడానికే రంగంలోకి దిగామన్న పాకిస్తాన్
- వివాదాలను దౌత్య మార్గాల్లో పరిష్కరించుకోవాలని చైనా, రష్యా సూచన

2లో




## నేను చెప్పినట్టే తీర్పు వచ్చింది

- ఢిల్లీ లిక్కర్ కేసులో కోర్టు తీర్పుపై కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు
- పార్టీ పెట్టేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఇది నాకు ఆశీర్వాదమే


2లో

## రెడ్ బుక్‌లో జగన్ పేరు ఉందో, లేదో త్వరలో తెలుస్తుంది

- గత ప్రభుత్వంలో తప్పులు చేసిన అధికారులు, నాయకులను వదిలిపెట్టేది లేదన్న లోకేశ్
- తిరుమల లడ్డూ కల్తీపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులకు క్షమాపణ
- చిన్నారుల సోషల్ మీడియా వాడకంపై 90 రోజుల్లో బలమైన ఫ్రేమ్‌వర్క్
- 75 ఏళ్ల వయసులోనూ చంద్రబాబు 25 ఏళ్ల యువకుడిలా పనిచేస్తారని ప్రశంస



2లో



# ప్రైవేట్ పెట్టుబడులు వెల్లువెత్తాలి

**నవీన ఆవిష్కరణలకు నడుం బిగించాలి పారిశ్రామిక వర్గాలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచన**

న్యూఢిల్లీ: దేశంలో మరిన్ని పెట్టుబడులు, నవీన ఆవిష్కరణలకు భారత పారిశ్రామిక వర్గాలు తక్షణమే నడుం బిగించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధిలో ప్రైవేట్ రంగం సైతం కీలక పాత్ర పోషించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వరుస బడ్జెట్‌ల ద్వారా పెట్టుబ డులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సైతం పెట్టుబడి వ్యయాన్ని భారీగా పెంచుతోందని గుర్తుచేశారు.

# ఇక కోర్ అర్బన్ చట్టం

(మొదటి పేజీ తరువాయి)

కోర్ అర్బన్ ఏరియాలో రోడ్ల నిర్మాణ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఎం తెలిపారు. రోడ్డు నిర్మించిన తర్వాత దాని జీవిత కాలం ఎంతనేది నిర్ణయించి, ఆ లోపు దానిని తొలగించినా అక్కడ మళ్లీ రోడ్డు వేసినా అందుకు బాధ్యులు ఎవరో తేల్చాలని సీఎం ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియాలో ప్రతి వీధి దీపం వెలుగుతుందో లేదో డ్యాష్ బోర్డులో కనిపించాలని సీఎం అన్నారు. అలాగే ఫుడ్ సేఫ్టీకి ఎక్కువ ప్రాధాన్యమివ్వాలని సీఎం సూచించారు. నగరంలోని అన్ని హోటళ్లలోని కిచెన్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. ఫైర్ సేఫ్టీకి పెద్ద పీట వేయాలని, నగరంలోని సర్కిల్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలని సూచించారు ఆర్ అండ్ బీ, ఇతర విభాగాల పరిధిలోని రోడ్లన్నింటినీ ఎంఏయూడీ(మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్)పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. నగరంలో వివిధ ప్రదేశాల్లో రద్దీ తగ్గించేందుకు డిజైన్ చేసిన ఎలివేటెడ్ కారిడార్ల నమూనాలను అధికారులు ప్రదర్శించారు. వాటిని పరిశీలించిన సీఎం పలు సూచనలు చేశారు. చారిత్రక ప్రాధాన్యం గల కట్టడాలను పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు.

భవనాల పనులు వేగవంతం చేయాలి

భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని , అక్కడ అవసరమైన అనుమతులు వెంటనే తీసుకోవాలని సూచించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల భవనాల పనులు వేగవంతం చేయాలని సీఎం సూచించారు. నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలన్నారు. హైడ్రా పరిరక్షించిన చెరువుల చుట్టూ కట్టలు కట్టి వదిలి వేయకుండా వాటి రక్షణతోపాటు సుందరీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, ఎంఏయూడీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఇ.వి.నరసింహారెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనర్లు కర్ణన్, జి.సృజన, వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టు నేతల లొంగుబాటుపై అసెంబ్లీలో ప్రకటన చేస్తా

మావోయిస్టు కీలక నేతల లొంగుబాటుపై అసెంబ్లీలో ప్రకటన చేస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. మావోయిస్టు మాజీ అగ్ర నాయకులు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, నూనె నరసింహారెడ్డి, సుజాతక్క, దామోదర్, చంద్రన్నలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సచివాలయంలో సమావేశమైన విషయం తెలిసిందే. భేటీ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జనజీవన స్రవంతిలోకి వచ్చిన తర్వాత చట్టపరిధిలో వారు ఏమైనా చేసుకోవచ్చని తెలిపారు. చట్టాలను ఉల్లంఘిస్తే మాత్రం ప్రభుత్వం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అనంతరం మాజీ మావోయిస్టు దేవ్‌జీ కీలక వ్యాఖ్యలు చేశారు. రివార్డు పాలసీని కోటి రూపాయలకు పెంచాలని ఆయన కోరారు. తమకు ఐదెకరాల భూమి ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. భూమి సాధ్యం కాదని ముఖ్యమంత్రి చెప్పారని, కానీ ఇల్లు, ఉద్యోగం, జీవనభృతిపై హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం అనుమతిస్తే జైళ్లలో ఉన్న మావోయిస్టులను కలిసి, ఆ తర్వాత లొంగుబాట్లపై అందరం కలిసి ప్రజలకు బహిరంగ లేఖ రాస్తామని తెలిపారు.

## బస్తీల బాట పట్టిన కిషన్ రెడ్డి

సికింద్రాబాద్ నియోజకవర్గంలోని బౌద్ధనగర్, సీతాఫల్‌మండి, మెట్టుగూడ డివిజన్లలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈరోజు పర్యటించారు. గల్లీ గల్లీ తిరుగుతూ బస్తీ వాసుల కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఆయన, మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ... జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై మండిపడ్డారు. బీజేపీని రాజకీయంగా దెబ్బతీసి, నగరాన్ని మజ్లిస్ పార్టీకి అప్పగించేందుకే ఈ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజల సమస్యలను గాలికొదిలేశాయని విమర్శించారు. నగరంలో తాగునీటి ఎద్దడి ప్రారంభమైందని, వర్షపు నీటి కాలువల్లో పూడిక తీయకుండానే కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యంతో ఆడుకోవద్దని, సీఎం రేవంత్ రెడ్డి వెంటనే ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్ సమస్యలపై వెంటనే నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ పాలకవర్గం రద్దయిన నేపథ్యంలో, తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ప్రైవేట్ పెట్టుబడులు వెల్లువెత్తాలి

శుక్రవారం 'టెక్నాలజీ, రిఫామ్స్, ఫైనాన్స్ ఫర్ వికసిత్ భారత్'పై మొదటి పోస్ట్‌బడ్జెట్ వెబినార్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. 11 ఏళ్ల క్రితం ప్రభుత్వ పెట్టుబడి వ్యయం రూ.2 లక్షల కోట్లుగా ఉండేదని, ఇప్పుడు అది రూ.12 లక్షల కోట్లకు చేరిందని వెల్లడించారు. రెట్టించిన ఉత్సాహంతో ప్రైవేట్ పెట్టుబడులు వెల్లువెత్తేలా 202627 బడ్జెట్‌లో పలు ప్రకటనలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం, పారిశ్రామిక వర్గాలు, నైపుణ్యాలు కలిగిన భాగస్వాములు కలిసి కట్టుగా పనిచేస్తే సంస్కరణలు అద్భుతమైన ఫలితాలు ఇస్తాయన్నారు. కాగితంపై ప్రకటించినవి క్షేత్రస్థాయిలో విజయాలుగా నమోదు అవుతాయన్నారు. పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ ప్రాధాన్య రంగాల గురించి ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. రహదారులు, రైల్వేలు, ఓడ రేవులు, విమానా శ్రయాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఇంధన వ్యవస్థల్లో ప్రభుత్వం రికార్డు స్థాయిలో పెట్టుబడి వ్యయం చేస్తున్నట్లు తెలియజేశారు. ఆయా రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులకు చక్కటి అవకాశాలు ఉన్నాయన్నారు. '2047 నాటికి వికసిత్ భారత్' ఆశయాన్ని సాకారం చేసుకోవడానికి 'సంస్కరణల భాగస్వామ్య చార్టర్' రూపొందించుకుందామని మోదీ ప్రతిపాదించారు.

## అఫ్గానిస్తాన్‌పై పాక్ దాడులు

ఇస్లామాబాద్: ఒకప్పటి మిత్రదేశాలైన పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ పరస్పరం కయ్యానికి కాలు దువ్వుతున్నాయి. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. పాక్ సైన్యం గురువారం రాత్రి అఫ్గాన్‌పై వైమానిక దాడులు ప్రారంభించింది. 'ఆపరేషన్ గజబ్ లిల్ హక్'పేరిట కాబూల్, కాందహార్, పాక్తియా తదితర ప్రాంతాలపై విరుచుకుపడింది. ఈ దాడుల్లో కనీసం 274 మంది తాలిబన్లు మరణించారు. మరో 400 మందికిపైగా గాయపడ్డారు. తాలిబన్లకు చెందిన 27 సైనిక పోస్టులు ధ్వంసమయ్యాయి. తొమ్మిది సైనిక పోస్టులను పాక్ సైన్యం స్వాధీనం చేసుకుంది. అలాగే అఫ్గాన్‌లో పలు యుద్ధ ట్యాంకులు సైతం ధ్వంసమైనట్లు సమాచారం. తాలిబన్ల సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని పాక్ వైమానిక దాడులు జరిగాయి. సరిహద్దుల్లో తాలిబన్ల దాడులను తిప్పికొట్టడానికే తాము రంగంలోకి దిగాల్సి వచ్చినట్లు పాక్ తేల్చిచెప్పింది. అఫ్గాన్‌పై బహిరంగ యుద్ధం ప్రారంభించామని పాకిస్తాన్ రక్షణ శాఖమంత్రి అసిఫ్ ఖవాజా ప్రకటించారు. తమ ఓపిక పూర్తిగా నశించిందని, రెండు దేశాల మధ్య బహిరంగ యుద్ధం సాగుతోందని పేర్కొన్నారు. పొరుగుదేశం గుట్టుమట్లు తమకు తెలుసంటూ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. 'దమా దమ్ మస్త్ ఖలందర్'అనే సూఫీ ఆధ్యాత్మిక గీతాన్ని సైతం ప్రస్తావించారు. తదుపరి పరిణామాల గురించి ఆలోచించకుండా తాము చేయాల్సింది చేసి చూపిస్తామని పరోక్షంగా హెచ్చరించారు.

**కసులు నేను ఒంటరిగా ఎదుర్కొన్నా..**

'కోర్టు తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించి ఓ వైపు అభినందనలు తెలు పుతూనే మరోవైపు ఎన్నికల్లో పార్టీ ఓటమికి నేనే కారణం అనే అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌పై కక్ష సాధింపులో భాగంగా నాపై కేసు పెట్టారు. నేను జైలుకు వెళ్లిన తర్వాత కేసీఆర్, కేటీఆర్‌తో సహా పార్టీ పెద్ద నాయకులు ఎవరూ ప్రెస్‌మీట్‌లు పెట్టలేదు. కేసులు నేను ఒంటరిగా ఎదుర్కొన్నా. కనీ సం పార్టీ సోషల్ మీడియా కూడా మద్దతు ఇవ్వలేదు. తప్పుడు ప్రచారా లను ఎదుర్కొని ఉంటే బీఆర్ఎస్‌కు ఈ తరహా గతి పట్టేది కాదు. ఉద్యో గాలు, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వకపోవడం, దోపిడీదార్లకు టికెట్లు ఇవ్వ డం, పార్టీ నేతల అహంకారం వల్లే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలైందనే విమర్శ ఉంది. కానీ కోర్టు తీర్పును తమకు అనుకూలంగా మలుచు కుని బీఆర్ఎస్ ఓటమిని నా మెడలో వేయాలని చూస్తున్నారు. కేటీఆర్ ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి తప్పులను సమీక్షించుకోవాలి. ఒక వ్యక్తి తప్పు చేస్తే ఓటమి పాలయ్యే స్థితిలో బీఆర్ఎస్ ఉందా. అసెంబ్లీ ఎన్నికల సమ యంలో నా పేరు ఎక్కడా చర్చల్లో లేదు.

## నేను చెప్పినట్టే తీర్పు వచ్చింది

హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కడిగిన ముత్యంలా బయటకు వస్తానని గతంలో తాను చెప్పినట్లుగానే కోర్టు తీర్పు వచ్చిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చెప్పారు. మద్యం పాలసీ కేసులో నిందితులుగా పేర్కొన్న వారందరికీ కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నానన్నారు. లిక్కర్ కేసులో శుక్రవారం సీబీఐ కోర్టు తీర్పు నేపథ్యంలో కవిత మీడియాతో మాట్లాడారు. 'ఈ కేసు మూలంగా ఐదున్నర నెలల పాటు పిల్లలు, కుటుంబానికి దూరంగా ఉంటూ బాధ, అవ మానాలు, వ్యక్తిత్వ హననం ఎదుర్కొన్నా. ఎన్ని కోట్లు ఇచ్చినా నేను పొందిన అవమానానికి, కోల్పోయిన సమయానికి వెలకట్టలేరు. కుటుంబం ఇచ్చిన ధైర్యంతోనే కన్నీళ్లు దిగమింగుకుని ముందుకు సాగా. ప్రజా సేవ చేసేందుకు ఈ కేసులు నాకు ఎంతమాత్రం అడ్డంకి కాబోవు..' అని కవిత పేర్కొన్నారు.

## రెడ్ బుక్‌లో జగన్ పేరు ఉందో, లేదో త్వరలో తెలుస్తుంది: నారా లోకేశ్

ముంబయిలో ఏబీపీ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జరిగిన 'ఐడియాస్ ఆఫ్ ఇండియా - 2026' సదస్సులో ఏపీ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ పలు కీలక అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా, గత ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడిన వారి పేర్లతో తాను నిర్వహిస్తున్న 'రెడ్ బుక్'లో మాజీ ముఖ్యమంత్రి జగన్ పేరు ఉందో లేదో త్వరలోనే తెలుస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో తమ పార్టీ కార్యకర్తలను, నాయకులను, సాధారణ ప్రజలను అక్రమ కేసులతో తీవ్రంగా వేధించారని లోకేశ్ ఆరోపించారు. చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులు, వారిని ప్రోత్సహించిన రాజకీయ నాయకులు, చిత్రహింసలకు గురిచేసిన వారి పేర్లను రెడ్ బుక్‌లో నమోదు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని, తప్పు చేసిన ప్రతి ఒక్కరూ శిక్ష అనుభవించాల్సిందేనని హెచ్చరించారు. అయితే, ఈ జాబితాలో జగన్ పేరు ఉందా లేదా అనే విషయంపై ఉత్కంఠ రేపుతూ, ఆ విషయం త్వరలోనే తెలుతుందని వ్యాఖ్యానించారు.

**75 ఏళ్ల యువకుడు చంద్రబాబు**

ఈ సందర్భంగా తన తండ్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు పనితీరు గురించి లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు ఒక 'టఫ్ టాస్క్‌మాస్టర్' అని, 10 కిలోలు ఎత్తగలిగితే 14 కిలోల లక్ష్యం నిర్దేశిస్తారని, అది సాధిస్తే 18 కిలోల బరువు మోయమంటారని, దీనికి అంతం ఉండదని అన్నారు. ఆయన ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయడమే తమ పని అని తెలిపారు. 75 ఏళ్ల వయసులోనూ చంద్రబాబు 25 ఏళ్ల యువకుడిలా పనిచేస్తారని, ఆయన టేబుల్ వద్దకు తీసుకొచ్చే శక్తి అమోఘమని ప్రశంసించారు. "క్వాంటమ్ కంప్యూటింగ్ గురించి ఒక మీటింగ్‌లో చంద్రబాబు అడిగినప్పుడు, స్టాన్‌ఫోర్డ్ ఎంబీఏ చదివినా నాకు దానిపై అవగాహన లేదు. నేను టేబుల్ కింద ఫోన్‌లో చాట్‌జీపీటీలో వెతుక్కోవాల్సి వచ్చింది. ఆయన ఆలోచనలను అందుకోవడం చాలా కష్టం" అని లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించారు. తిరుమల లడ్డూ ప్రసాదం అంశాన్ని లోకేశ్ తీవ్రంగా పరిగణించారు. 2019-24 మధ్య లడ్డూ తయారీలో పెద్ద ఎత్తున కల్తీ జరిగిందని, రసాయనాలు వాడారని అంగీకరించారు. జగన్ హయాంలో జరిగిన ఈ అపచారానికి, రాష్ట్ర మంత్రిగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ సమాజానికి క్షమాపణ చెబుతున్నట్లు ప్రకటించారు. లడ్డూ ప్రసాదంతో భక్తులకు ఉన్న భావోద్వేగ బంధాన్ని గుర్తుచేశారు. ఈ కల్తీకి బాధ్యులైన వారిని, సిట్ నివేదిక ప్రకారం మాజీ టీటీడీ ఛైర్మన్‌తో సహా ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

## ఏపీలో పాలు, నీళ్లు కూడా ప్రాణాంకతమే: జగన్

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని, చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తాగే నీరు, పాలు కూడా ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారాయని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో వరుసగా చోటుచేసుకుంటున్న డయేరియా, కల్తీ పాల మరణాలు ప్రభుత్వ వైఫల్యానికి నిలువుటద్దమని ఆయన విమర్శించారు. పరిపాలనపై పట్టుకోల్పోయిన పాలకులు, ప్రతిపక్షంపై బురద చల్లడం, కక్ష సాధింపులపైనే దృష్టి పెట్టారని, ప్రజల ప్రాణాలను గాలికొదిలేశారని జగన్ ఆరోపించారు. గత వారంలోనే శ్రీకాకుళంలో కలుషిత నీటి కారణంగా డయేరియా ప్రబలి ఐదుగురు మరణించగా, 200 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారని జగన్ గుర్తుచేశారు. అదే వారంలో రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మంది వెంటిలేటర్లపై ప్రాణాలతో పోరాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోషణ ఇవ్వాల్సిన పాలు, దాహం తీర్చాల్సిన నీళ్లు ప్రాణాలు తీస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన గత 14 నెలల్లో రాష్ట్రంలోని హాస్టళ్లు, విద్యాసంస్థల్లో సుమారు 25 ఫుడ్ పాయిజన్ ఘటనలు జరిగాయని, వీటి వల్ల 15 జిల్లాల్లో 900 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని జగన్ వివరించారు. కురుపాం గిరిజన బాలికల పాఠశాలలో తాజాగా 16 మంది విద్యార్థినులు డయేరియాతో అస్వస్థతకు గురయ్యారని, గతంలో ఇదే పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు మరణించినా ప్రభుత్వం పాఠాలు నేర్చుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో నెలకొన్న దారుణ పరిస్థితులను జాతీయ మీడియా సైతం ఎండగడుతోందని తెలిపారు. గడచిన 18 నెలల్లో చేబ్రోలు, విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం వంటి అనేక ప్రాంతాల్లో డయేరియా ప్రబలి వందలాది మంది అస్వస్థతకు గురై, డజన్ల కొద్దీ మరణాలు సంభవించాయని జగన్ ఆరోపించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపానికి స్పష్టమైన నిదర్శనమన్నారు. ఆహార భద్రత, సురక్షిత నీటి సరఫరా వంటి కనీస బాధ్యతలను కూడా ప్రభుత్వం విస్మరించిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిద్ర మేల్కొని, రాజకీయ ప్రయోజనాలు పక్కనపెట్టి చిత్తశుద్ధితో పరిస్థితిని సమీక్షించాలని జగన్ డిమాండ్ చేశారు. లోపాలను గుర్తించి సరిదిద్దాలని, సురక్షిత నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చాలని, ఆహార భద్రత పర్యవేక్షణను కఠినంగా అమలు చేయాలని సూచించారు.


## ఈ ఏడాది చివరికి 10 లక్షల పైగా గృహ ప్రవేశాలు జరిపిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

2029 నాటికి రాష్ట్రంలోని పేదలందరికీ పక్కా ఇళ్లు కట్టించడంతో పాటు, అర్హులైన వారికి ఉచితంగా ఇంటి స్థలాలు కూడా పంపిణీ చేస్తామని భరోసా ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల చొప్పున స్థలాన్ని కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2.20 లక్షల కుటుంబాలకు సొంత జాగా లేదని గుర్తించామన్నారు.దగత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ రంగం, ఇసుక విధానాల్లో జరిగిన అవినీతిపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పేదల ఇళ్ల పేరుతో గత పాలకులు భారీగా అక్రమాలకు పాల్పడ్డారని, ఇసుక విధానాన్ని అస్తవ్యస్తం చేసి దోచుకున్నారని ఆరోపించారు. ఈ కుంభకోణాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, త్వరలోనే దీనికి సంబంధించిన కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అందరికీ ఇళ్లు ఇచ్చే బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తాయని తెలిపారు.

**వ్యవసాయానికి 'పంచ సూత్రాల' ఊతం**

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన వ్యవసాయ



రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం 'పంచ సూత్రాల' విధానాన్ని అమలు చేస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. అగ్రిటెక్, నీటి భద్రత, డిమాండ్ ఉన్న పంటల సాగు, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా రైతులను ఆదుకుంటామని చెప్పారు. వ్యవసాయంలో యాంత్రీకరణతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సేవలను కూడా రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామని సీఎం గుర్తుచేశారు. ఇందులో రాష్ట్ర వాటాగా రూ.14,000, కేంద్రం వాటాగా రూ.6,000 కలుపుకుని పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే 47 లక్షల మంది రైతులకు రెండు విడతల్లో రూ.6,309 కోట్లు జమ చేశామని, గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,670 కోట్లు కూడా తామే చెల్లించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని, ఇప్పటివరకు రూ.10,816 కోట్లు చెల్లించామని వివరించారు. ఉచిత విద్యుత్ కోసం 2025-26 బడ్జెట్‌లో రూ.13,722 కోట్లు కేటాయించామని, ఈ ఏడాది కొత్తగా 69 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామని చెప్పారు.

రాష్ట్రంలో ఉద్యానవన, ఆక్వా రంగాల అభివృద్ధికి భారీ ప్రణాళికలు రూపొందించామని చంద్రబాబు తెలిపారు. రాయలసీమను 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు రూ.30 వేల కోట్లతో క్లస్టర్ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రైవేటు పెట్టుబడులతో కలిపి మొత్తం రూ.1 లక్ష కోట్లతో సీమ రూపురేఖలు మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం 400 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉన్న ఉత్పత్తులను 1000 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచడమే లక్ష్యమన్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# సంపూర్ణమైన బ్రహ్మోత్సవాలు.. భక్తజన సంద్రమైన గిరి శిఖరం

- మహా పూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ఉత్సవ సమాప్తి
- విష్ణు పుష్కరిణిలో వైభవంగా శ్రీ చక్రస్నానం
- 108 రకాల పుష్పాలతో కనులవిందైన పుష్పయాగం
- గోవింద నామస్మరణతో మారుమోగిన యాదగిరి గిరిధామం
- దేవతా ఉద్వాసనతో ఘనంగా ముగిసిన క్రతువులు
- భక్తులను ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు - సమిష్టి కృషితో విజయవంతమైన బ్రహ్మోత్సవాలు













**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 27 (తొలివెలుగు):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం లో నిర్వహించిన పది రోజుల వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం మహా వైభవంగా ముగిశాయి. వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా మహా పూర్ణాహుతి, విష్ణు పుష్కరిణిలో భక్తిశ్రద్ధలతో శ్రీ చక్రస్నానం, 108 రకాల పుష్పాలతో నయనానందకరంగా శ్రీ పుష్పయాగం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా హోమగుండంలో సుదర్శన, నరసింహ, లక్ష్మీ, విష్ణు, గరుడ తదితర దేవతామంత్రాలతో విశేష హవనాలు నిర్వహించారు. పసుపు, కుంకుమలతో అలంకరించిన హోమగుండం వద్ద వేద పండితులు, రుత్వికులు మంత్రోచ్ఛారణల నడుమ మహా పూర్ణాహుతి సమర్పించారు. కళ్యాణోత్సవం పూర్తి చేసుకున్న స్వామి అమ్మవార్లను ప్రత్యేక అలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విష్ణు పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి శ్రీ చక్రస్నానం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు శ్రీ చక్రపెరుమాళ్లను తలపై ధరించి గంగపూజ నిర్వహించగా, అనంతరం అర్చకులు, అధికారులు, భక్తులు కలిసి పుష్కరిణిలో స్నాన మహోత్సవాన్ని ఆచరించారు. గోవింద నామస్మరణతో యాదగిరి గిరిధామం మారుమోగింది. బ్రహ్మోత్సవాల సమాప్తిని పురస్కరించుకుని దేవతా ఉద్వాసన నిర్వహించి 12 కలశాలలో ఆవాహన చేసిన దేవతలకు శాస్త్రోక్తంగా పూజలు సమర్పించారు. శ్రీ పుష్పయాగంలో 108 రకాల పుష్పాలతో విశేష ఆర్చనలు చేశారు. వివిధ రాగ, తాళాలతో స్వామివారిని అలరించారు. వారం రోజులుగా సాగిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నాటికలు, భాగవతాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించిన కళాకారులను దేవస్థానం అధికారులు సత్కరించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడంలో దేవస్థానం అధికారులు, అర్చక బృందం, సిబ్బంది, భక్తులు సమిష్టిగా సహకరించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ నరసింహమూర్తి, ఈవో భవాని శంకర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, డీఈఓ దౌర్భాల భాస్కర్ శర్మ, ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గట్టుగల ఎల్లయ్య వర్ధంతి

**రాజపేట, ఫిబ్రవరి 27 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలంలోని పాముకుంట గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో పార్టీ నేత గట్టుగల ఎల్లయ్య 22వ వర్ధంతి సభ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య స్థూపానికి పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యుడు చిగుళ్ల లింగం మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం సాగిన పోరాటాల్లో ఎల్లయ్య సక్రియంగా పాల్గొన్నారని తెలిపారు. ఇళ్ల స్థలాల కోసం నిర్వహించిన ఉద్యమాల్లో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ చేపట్టిన భూ పోరాటాల ఫలితంగా నిరుపేదలకు భూములు పంచిన చరిత్ర సీపీఐకే దక్కిందని అన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి ఇంజా హేమలత, మూలపోచయ్య, దొంతి సారంలక్ష్మిపతి, ఎల్లయ్య కుటుంబ సభ్యులు బాబురావు, జానయ్య, గ్రామస్తులు ఎల్లయ్య వెంకటపురం రమేష్, మాచర్ల నరసయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీకి చెందిన అంతర్జాతీయ సైబర్ నేరస్థుడి అరెస్ట్.!

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంతర్జాతీయ సైబర్ నేరస్థుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. కంబోడియా నుంచి వస్తుండగా చెన్నై విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. మ్యాట్రిమోనీ, క్రిప్టో ఇన్వెస్ట్‌మెంట్ల పేరిట జనాలను మోసం చేస్తున్న అతడిని విశాఖకు చెందిన ప్రసన్న కుమార్‌గా గుర్తించారు. మ్యాట్రిమోనీ సైట్లలో యువతిగా ప్రొఫైల్ క్రియేట్ చేసుకున్న ప్రసన్నకుమార్.. పలువురు యువకులను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసాలు చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. అక్రమంగా అతడు సుమారు 500 సిమ్ కార్డులు సేకరించినట్టుగా పోలీసులు తెలిపారు. ప్రసన్న కుమార్‌కు అంతర్జాతీయ సైబర్ ముఠాతో సంబంధాలున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. అతడిని విచారిస్తే సైబర్ నేరాలకు సంబంధించిన మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని చెబుతున్నారు.

## శ్రీగిరి క్షేత్రంలో ముగిసిన బ్రహ్మోత్సవ వేడుకలు

- వైభవంగా చక్రస్నానం.. కన్నులపండువగా పుష్పయాగం
- మహా పూర్ణాహుతితో ముగిసిన వార్షిక ఉత్సవాలు
- శ్రీగిరి క్షేత్రంలో మిన్నంటిన గోవింద నామస్మరణ
- భక్తిశ్రద్ధలతో ధ్వజ అవరోహణ క్రతువు
- విజయవంతం చేసిన భక్తులకు ట్రస్టు సభ్యుల కృతజ్ఞతలు
- విద్యుత్ కాంతులతో శోభాయమానంగా ఆలయ పరిసరాలు



**రాజపేట, ఫిబ్రవరి 27 (తొలివెలుగు):** రాజపేట మండలం రేణికుంట శివారులోని శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు మహా పూర్ణాహుతి, శ్రీ పుష్పయాగం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో ఉత్సవాలు వైభవంగా సమాప్తమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాలు ఆరాధన సేవ, కాలం నివేదన, తీర్థప్రసాద గోష్టి, శాంతిపాఠం, చతుస్థానార్చన, శ్రీ సుదర్శన నరసింహ ద్వారా బలిహరణ, పూర్ణాహుతి, మూర్తి కుంభ ఉద్వాసన, అష్టోత్తర శతకలశ స్థాపన, మూర్తి కుంభ ప్రోక్షణ, చక్రస్నానం, నివేదన, మంగళశాసనం తదితర వైదిక కర్మలతో కొనసాగాయి. అనంతరం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, దేవతోద్వాసనం, ద్వాదశ ఆరాధన, శ్రీ పుష్పయాగం, సతాహరణ, ధ్వజావరోహణ, మహదాశీర్వచనం, రుత్విక్ సన్మానం నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ ట్రస్ట్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడంపై నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. ట్రస్ట్ సభ్యులు వట్టం రాఘవేందర్ గుప్త, కూర బద్రీనాథ్ గుప్త, సూది రెడ్డి నాగిరెడ్డి, సమ్మెట శ్రీనివాసరావు, ఎల్లారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలు, పచ్చని తోరణాలు, పూలమాలలతో సుందరంగా అలంకరించారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం ఉత్సవ వాతావరణంలో కళకళలాడింది.





## కుమ్మెర ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలి

- రాజపేటలో రజక సంఘాల నిరసన
- బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్

**రాజపేట, ఫిబ్రవరి 27 (తొలివెలుగు):** నాగర్‌కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో అగ్రకుల అహంకారంతో బీసీ దళిత కుటుంబానికి చెందిన గణేష్, చంద్రకళలపై దాడి చేసి పసికందు మరణానికి కారణమైన నిందితులను తక్షణమే అరెస్టు చేసి హత్య కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని బీసీ నేత జూకంటి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ శుక్రవారం రాజపేట మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహం ముందు రజక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కుల దురంకార హత్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే కుమ్మెర ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున కోటి రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఘటనలో సంబంధం ఉన్న వారందరిపై ఎలాంటి రాజకీయ ఒత్తిడులకు లోనుకాకుండా నిష్పక్షపాత విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు సట్టు సిద్ధులు, సంగెం మధు, సట్టు బిక్షపతి, సంగెం ఆంజనేయులు, పుల్లంగారి కిరణ్, వరిమడ్ల కనకయ్య, సంగెం వేణుగోపాల్, సట్టు రవీందర్, సంగెం కుమార్, పుల్లంగారి వంశీ, ఐరేణి పరశురాములు, ఐరేణి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆధ్యాత్మిక శోభతో నగర సంకీర్తన

**- రాజపేటలో భక్తిశ్రద్ధలతో ఏకాదశి వేడుకలు**

**రాజపేట, ఫిబ్రవరి 27 (తొలివెలుగు):** ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజపేట మండల కేంద్రంలో శుక్రవారం నగర సంకీర్తన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ రామకృష్ణ సాయి మందిరం నుంచి ప్రారంభమైన ఈ సంకీర్తన ప్రధాన వీధుల గుండా సాగుతూ పలు ఆలయాల్లో దర్శనం చేసుకుంటూ కొనసాగింది. హరే రామ నామ జపంతో భక్తులు భజనలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. మర్కుక్ శ్రీ భావానంద స్వామి ఆశీస్సులతో అదరాసుపల్లి శ్రీధర శర్మ పర్యవేక్షణలో, ఆలయ అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ ఆధ్వర్యంలో, రాజపేట శాఖ అధ్యక్షుడు నంగునూరు రాజు నాయకత్వంలో కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో దీపారాధన, సకల దేవతామూర్తుల దర్శనాల అనంతరం నగర సంకీర్తన నిర్వహించి భావానంద అష్టకాన్ని సామూహికంగా పారాయణం చేశారు. జై శ్రీమన్నారాయణ భక్త బృందం అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసింది. సార్ధ త్రి శతకోటి హరే రామ నామ జప యజ్ఞంలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని భక్తులు తెలిపారు. కార్యక్రమంలో నంగునూరు జగదాంబ, నాళ్ల పద్మ, పరమేశ్వరి, చామకూర అరుణ, పెంట రజిత, బిర్రు భాగ్యలక్ష్మి, బోగలత, బిర్రు శ్రీనివాసులు, ఉప్పల శ్రీనివాసులు, కోనూరు బిక్షపతి, గౌటే బాలరాజు, నాళ్ల శేఖర్, ఉప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## కళ్లు చెదిరితే.. ప్రమాదాలు తప్పవు!

- వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలి
- 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్2026'లో భాగంగా చౌటుప్పల్ పోలీసుల ప్రత్యేక చర్యలు
- మల్కాపుర్ ఐవోసీఎల్ కంపెనీలో డ్రైవర్లకు కంటి పరీక్షలు
- ట్రాఫిక్ నియమాలపై ఇన్‌స్పెక్టర్ మన్మధ కుమార్ దిశానిర్దేశం
- హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై అవగాహన



**చౌటుప్పల్, ఫిబ్రవరి 27 (తొలివెలుగు):** 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్2026' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చౌటుప్పల్ పోలీసుల ఆధ్వర్యంలో మల్కాపుర్‌లోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడిపేటప్పుడు కంటి చూపు అత్యంత కీలకమని, చూపు లోపిస్తే ప్రమాదాలు తప్పవని హెచ్చరించారు. ప్రతి డ్రైవర్ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి అని, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. వేగ పరిమితులను పాటించడం, ట్రాఫిక్ సంకేతాలను గౌరవించడం ప్రతి వాహనదారి బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో ఐవోసీఎల్ అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## షాపు నిర్వాహకురాలికి టోకరా

ఆభరణాలు ఇస్తే బంగారు బిస్కెట్లు అంటూ..

కేజీ బంగారు ఆభరణాలతో ఉడాయింపు.. ఘరానా మోసగాడిపై కేసు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 27: 'మా మేడమ్ వద్ద భారీగా బంగారు కడ్డీలు ఉన్నాయి.. బ్లాక్ మనీని వైట్ చేసుకునేందుకు ఆభరణాలు కొనాలనుకుంటున్నారు..' అంటూ నమ్మించి కేజీ బంగారు నగలతో ఉడాయించిన ఘరానా మోసగాడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం.2లో 'స్వర్ణ కావ్యం' పేరుతో ఆభరణాల షాపు నిర్వహిస్తున్న పాలకుర్తి లక్ష్మీకావ్యకు ఈనెల 17న శ్రీనాథ్ రాఠీ అలియాస్ అంకిత్(31) అనే వ్యక్తి ఫోన్ చేశాడు.తాను ప్రముఖ వ్యాపారి సుబ్బరామిరెడ్డి కుమార్తె పింకీరెడ్డి పీఏనంటూ పరిచయం చేసుకున్నాడు. పింకీ రెడ్డి కుటుంబం వద్ద భారీగా బంగారం బిస్కెట్లు ఉన్నాయని, వీటిని ఇచ్చి ఆభరణాలుగా మార్చుకోవాలనే ఆలోచనలో ఉన్నారని తెలిపాడు. వీటితోపాటు బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చుకునేందుకు మీ షాపులో ఆభరణాలు కొనుగోలు చేస్తే మీ ట్రాన్సాక్షన్స్ కూడా పెరిగి బ్యాంక్ లోన్లు వస్తాయని నమ్మబలికాడు. ఈ మేరకు లక్ష్మీకావ్యను కలిసిన శ్రీనాథ్ రాఠీ, అతడి అనుచరులు కృష్ణ, మనోజ్ అనే వ్యక్తులు మొదట 16తులాల బంగారు నగలు తీసుకుని రెండు చెక్కులు ఇవ్వడంతో పాటు మరుసటిరోజు 160 గ్రాముల బంగారం బిస్కెట్ ఇచ్చారు.రెండ్రోజుల తర్వాత ఇదే విధంగా 30 తులాల ఆభరణాలు తీసుకుని ఆ మేరకు బంగారం బిస్కెట్ ఇచ్చారు.

# షోరూంల్లో వాహనాల రిజిస్ట్రేషన్.. సర్వర్ డౌన్‌తో వాహనదారుల ఇబ్బందులు




షోరూంల్లో వాహన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జఠిలంగా మారుతున్నది. కొత్త వాహనం కొనుగోలు చేద్దామనుకున్న వారికి సాంకేతిక ఇబ్బందులు అడ్డుపడుతున్నాయి. ఇప్పటికే రిజిస్ట్రేషన్ పూర్తయిన వాహనాలకు సంబంధించిన ఆర్సీలు అందడంలోనూ జాప్యం అవుతున్నదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కొందరి పేర్లపై రెండు వాహనాలు ఉన్నప్పటికీ ఆ డేటా షోరూంల సర్వర్‌లో కనిపించడం లేదని చెబుతున్నారు. వారి వివరాలు నమోదు చేసి.. కొన్ని వాహనాలు రిజిస్ట్రేషన్ పూర్తయినట్లు తెలిసింది. దీని ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాంటి వాహనాల రిజిస్ట్రేషన్ పునః పరిశీలిస్తున్నట్టు తెలిసింది. చాలా వరకు సర్వర్ డౌన్ సమస్య తలెత్తుతున్నది. దీంతో ఆ వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వాయిదా వేస్తున్నారు. రిజిస్ట్రేషన్ కోసం బ్యాంక్ అకౌంట్ వివరాలు అడగడం వల్ల చాలా మంది కొనుగోలుదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జనవరి 24 నుంచి డీలర్ స్థాయి వాహన రిజిస్ట్రేషన్ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు సుమారు 7 వేల వాహనాలు ఈ ప్రక్రియ ద్వారా రిజిస్ట్రేషన్ అయ్యాయి. అయితే నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు మాత్రమే డీలర్ల వద్ద రిజిస్ట్రేషన్ అవుతాయి. గతంలో కొత్త వాహనం కొనుగోలు చేస్తే నెల రోజుల్లోపు ఎప్పుడైన స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియతో చాలా వాహనాల రిజిస్ట్రేషన్ కారణంగా రద్దీని తగ్గించడం కోసం షోరూంల్లోనే రిజిస్ట్రేషన్ల విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. కానీ షోరూంలో రిజిస్ట్రేషన్ విధానం పారదర్శకంగా లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే స్థానిక ఆర్టీఓ కార్యాలయాలతో సమన్వయం చేసుకోవాలని ఆర్టీఏ అధికారులు షోరూంల నిర్వాహకులకు సూచనలు చేశారు.

### రద్దుకు డిమాండ్

సాధారణంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ ఆర్టీఓ కార్యాలయాల్లో నెలకు 27-30వేల కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతాయి. గ్రేటర్‌లో 12 కార్యాలయాలు ఉన్నాయి. హైదరాబాద్‌లో ఖైరతాబాద్, తిరుమలగిరి, మలక్‌పేట, బండ్లగూడ, నాగోల్, టోలిచౌకి, రంగారెడ్డిలో మణికొండ, కొండాపూర్, మన్నెగూడ, మేడ్చల్‌లో మేడ్చల్, ఉప్పల్, కూకట్‌పల్లి ఆర్టీఏ కార్యాలయాలున్నాయి. ఒక్కరోజుకు 700 నుంచి వెయ్యి వరకు కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యేవి. ఇప్పుడు షోరూంల విధానంతో నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాల ప్రక్రియ కార్యాలయాల్లో జరగడం లేదు. కాగా, షోరూంల్లోని సాంకేతిక ఇబ్బందులు వల్ల వాహన కొనుగోళ్లు కూడా ఆలస్యమవుతున్నాయని వాహన సంఘాల నాయకులు వేముల మారయ్య, సత్తిరెడ్డి, వెంకటేశ్, నిరంజన్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు సారథి పోర్టల్ సమస్యలు మరోవైపు షోరూంల సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. సారథి పోర్టల్, షోరూం రిజిస్ట్రేషన్ల ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



## చిన్న పిల్లల మరణాలపై అధికారుల సమీక్ష

- చౌటుప్పల్ సిహెచ్‌సిలో వైద్యాధికారుల సమావేశం
- ఆదిలోనే కారణాలను గుర్తించాలి: డిఐఓ డాక్టర్ రామకృష్ణ

**చౌటుప్పల్, ఫిబ్రవరి 27 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో శుక్రవారం చిన్న పిల్లల మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తంగడపల్లి, సంస్థాన్ నారాయణపురం, పోచంపల్లి, వలిగొండ (వర్కట్‌పల్లి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి (డిఐఓ) డాక్టర్ కె. రామకృష్ణ మాట్లాడుతూ.. జన్మించిన ప్రతి శిశువు ఆరోగ్యంగా జీవించాలనే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. శిశు మరణాలకు దారితీసే కారణాలను ప్రారంభ దశలోనే గుర్తించి, సమయానుకూలంగా చర్యలు తీసుకుంటే మరణాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. శిశువులు తక్కువ బరువుతో జన్మించడం, గర్భకాలం పూర్తికాక ముందే ప్రసవం కావడం, న్యుమోనియా, సెప్సిస్ వంటి అంటువ్యాధులు, గర్భస్రావాలు, పోషకాహార లోపం వంటి అంశాలు శిశు మరణాలకు ప్రధాన కారణాలుగా గుర్తించినట్లు తెలిపారు. గర్భిణీ స్త్రీలకు సరైన పోషకాహారం, క్రమం తప్పని వైద్య పరీక్షలు, టీకాలు అందించడం ద్వారా ఈ సమస్యలను నివారించవచ్చని వివరించారు. శిశు మరణాల నివారణకు సమిష్టిగా కృషి చేయాలని అధికారులు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో చౌటుప్పల్ మండల వైద్యాధికారి డాక్టర్ చింతకింది కాటమరాజు, డాక్టర్ జ్యోతి, డాక్టర్ అశ్విన్ కుమార్, డాక్టర్ శివాని, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఉద్యోగికి రూ. 14.8 లక్షల టోకరా

సిటీబ్యూరో: సైబర్‌నేరగాళ్లు ఓ ప్రైవేట్ ఉద్యోగికి టోకరా వేశారు. మేడపల్లికి చెందిన బాధితుడి ఫోన్ నంబర్‌కు సైబర్ నేరస్తులు ఎల్‌కేపీ వీఐపీ వన్ టూ వన్ సర్వీస్ గ్రూప్, ఎల్‌కేపీ-77 అడ్వయిజరీ గ్రూప్‌ల పేర్లతో ఉన్న వాట్సాప్ గ్రూప్‌లకు యాడ్ చేశారు. బాధితుడు ఎల్‌కేపీఎన్ హెచ్‌డబ్ల్యూఎల్ పేరుతో ఉన్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అనంతరం ఆ యాప్ అడ్మిన్‌గా చెప్పుకొంటూ ఓ వ్యక్తి ఫోన్ చేసి 'మేమందరం స్టాక్ ట్రేడింగ్‌లో సంపాదిస్తున్నా'మని.. మీరు కూడా ఈజీగా డబ్బు సంపాదించుకోవచ్చంటూ సూచనలు చేశారు. ాబాధితుడు ఆ యాప్‌లో తన ఖాతాను తెరిచి మొదట రూ. 11 వేలు వెచ్చించి.. స్టాక్స్ కొనుగోలు చేశాడు. దఫ దఫాలుగా రూ. 14.95 లక్షలు అందులో పెట్టుబడి పెట్టి మోసపోయాడు. కేవలం 11600 మాత్రమే విత్ డ్రా చేయగలిగాడు. మిగతా సొమ్ము రూ. 14.84 లక్షలను సైబర్‌నేరగాళ్లు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మల్కాజిగిరి సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



## బల్కంపేట ఆలయ సిబ్బందిపై వేటు

**నలుగురు ఉద్యోగుల తొలగింపు**

**ఆలయాన్ని తనిఖీ చేసిన మంత్రి కొండా సురేఖ**

**దేవాలయ పరిపాలన గాడి తప్పిందని ఈవో, సూపరింటెండెంట్‌లపై ఆగ్రహం**

అమీర్‌పేట్, ఫిబ్రవరి 27: బల్కంపేట ఎల్లమ్మ ఆలయ సిబ్బందిపై మంత్రి వేటు వేశారు. శుక్రవారం మ్రంతి కొండా సురేఖ బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో ఆకస్మిక తనిఖీ చేశారు. పరిపాలనా వ్యవహారాలకు సంబంధించి అంశాల్లో లోపించిన స్పష్టతపై ఆమె అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవ వివరాలకు, అధికారులు చూపుతున్న వివరాలకు మధ్య వ్యత్యాసం ఉండటంతో వెంటనే ఫైళ్లు స్వాధీనం చేసుకుని, అల్మారాలకు సీల్ వేయాలని దేవాదాయ శాఖ ఆర్‌జేసీ శ్రీనివాస్‌రావును ఆదేశించారు. ఉద్యోగుల హాజరు పట్టిక కూడా అస్తవ్యస్తంగా మారిందని, మొత్తంగా దేవాలయ పరిపాలనా వ్యవస్థ గాడి తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓ కంప్యూటర్ ఆపరేటర్ సహా, ముగ్గురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తున్నట్టు పేర్కొన్నారు. దేవాలయం బయట ఉన్న షెడ్డును వెంటనే తొలగించాలని, ఎల్లమ్మ ఆలయానికి దాతగా వ్యవహరించిన దివంగత మాజీ సీఎం రోశయ్య పేరును పెట్టాలని సూచించారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పార్కింగ్ కాంప్లెక్స్‌ను సందర్శించిన మంత్రి సురేఖ అక్కడి నుంచే ఫోన్ ద్వారా డీఈతో మాట్లాడి వెంటనే కాంప్లెక్స్ నిర్మాణాలకు సంబంధించి పూర్తి నివేదికను పంపాలని ఆదేశించారు. దేవాలయంలో చోటు చేసుకుంటున్న అవకతవకలపై టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కోట నీలిమ మంత్రి సురేఖకు వివరించారు. ఆలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీసం ఈఎస్ఐ, ఈపీఎఫ్ వంటి ప్రాథమిక సదుపాయాలను కల్పించడంలో ఆలయ అధికారులు ఘోర వైఫల్యం చెందారన్నారు. ఆలయానికి చెందిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అంశాల్లో స్పష్టత లోపిస్తోందని, దాతలు సమర్పించుకున్న ఖరీదైన చీరలు కాంట్రాక్ట్ పాడుకున్న వ్యక్తులకు కాకుండా అధికారులు వాటిని స్వాధీనం చేసుకుంటున్నారనే ఫిర్యాదులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎల్లమ్మ దేవాలయ నిర్వహణలో అకౌంటెంట్, సూపరింటెండెంట్, ఈవోలు దారుణంగా విఫలమయ్యారన్నారు.




# ఈవీలపై మెర్సిడెస్ బెంజ్ ఫోకస్

## కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్

హైదరాబాద్: జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ క్రమంగా తన పంతాను మార్చుకుంటున్నది. లగ్జరీ కార్లతోపాటు విద్యుత్‌తో నడిచే వాహనాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇప్పటికే కొన్ని వాహనాలను విడుదల చేసినప్పటికీ ఇక నుంచి విడుదలయ్యేవాటిలో వీటికి అధిక ప్రాధాన్యతనివ్వనున్నట్టు కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. హైదరాబాద్‌తోపాటు తెలంగాణ, ఏపీలలో ఈవీ కార్లకు ఆదరణ క్రమంగా పెరుగుతున్నదని, ఇది వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడానికి దోహదం చేయనున్నదన్నారు. కంపెనీ మొత్తం విక్రయాల్లో ఈవీల వినిమయం చాలా తక్కువగా ఉన్నదని, ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్నదన్నారు. వచ్చే ఏడాది అంతర్జాతీయ మార్కెట్లోకి 40 కొత్త మాడళ్లను విడుదల చేయనున్నట్టు ప్రకటించిన ఆయన..వీటిలో కొన్ని దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకురానున్నట్టు ప్రకటించారు.మరోవైపు, ద్వితీయ శ్రేణి నగరాలతోపాటు తృతీయ శ్రేణి నగరాలపై సంస్థ ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. ఇటీవలకాలంలో మెట్రో నగరాలతోపాటు చిన్న స్థాయి నగరాల్లోనూ లగ్జరీ కార్ల అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయన్నారు.పూణెకు సమీపంలో రూ.3 వేల కోట్ల పెట్టుబడితో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ యూనిట్ సామర్థ్యం ఏడాదికి 20 వేల యూనిట్లు.ప్రస్తుతం భారత్‌లో సంస్థ 25 మాడళ్లను విక్రయిస్తుండగా, వీటిలో 11 దేశీయంగా తయారవుతుండగా, మిగతా మాడళ్లను దిగుమతి చేసుకుంటున్నది.ఈ ఏడాది కొత్తగా 16 టచ్‌పాయింట్లను ప్రారంభించింది. దీంతో టచ్‌పాయింట్ల సంఖ్య 140కి పైకి చేరుకున్నాయి.కంపెనీ మొత్తం వాహన విక్రయాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాటా 15 శాతంగా ఉన్నది. అలాగే 10 విక్రయ కేంద్రాలు ఉన్నాయి.

# పెట్టుబడి లేకుండానే వ్యాపారం.. 'డబ్ల్యూకామర్స్' వెల్లడి

హైదరాబాద్: సరుకులు నిల్వ చేయాల్సిన అవసరం లేదు..అంతేకాదు పైసా పెట్టుబడి లేకుండానే వ్యాపారం చేయవచ్చునని డిజిటల్ కామర్స్ సేవల సంస్థ డబ్ల్యూకామర్స్ వెల్లడించింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలను ఆసరాగా చేసుకొని చిరు వ్యాపారులు, వ్యక్తులు ఎవరైనా వ్యాపారం ప్రారంభించుకోవచ్చును. విక్రేతల పేరుతో కంపెనీ ఒక ఆన్‌లైన్ స్టోర్‌ను క్రియేట్ చేస్తున్నది. సోషల్ మీడియాలో ఈ ఆన్‌లైన్ స్టోర్‌కు సంబంధించి లింక్/క్యూఆర్‌కోడ్‌ను పోస్ట్ చేయడం లేదా బంధువులు, స్నేహితులకు షేర్ చేసిన చాలు. కంపెనీ ఆఫర్ చేసే ఉత్పత్తులను ఎవరు కొనుగోలు చేసినా..విక్రేతకు 20-40 శాతం వరకు లాభం రానున్నది. ఇలా బుకింగ్ చేసుకున్న వస్తువుల డెలివరీ బాధ్యతలను కంపెనీ తీసుకుంటుందని డబ్ల్యూకామర్స్ కో-ఫౌండర్, సీవోవో శ్రీధర్ శ్రీరామనేని తెలిపారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 22 వేలకు పైగా యాక్టివ్ ఆన్‌లైన్ స్టోర్స్ ఉన్నాయన్నారు. హెల్త్, వెల్‌నెస్, బ్యూటీ, పర్సనల్ కేర్, హోమ్ ఎసెన్షియల్ విభాగాలకు చెందిన 40కి పైగా బ్రాండ్ నుంచి 600కి పైగా ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు.

# అమెరికన్ బ్రాండ్ కారుపై రూ.2 లక్షల డిస్కౌంట్!

చాలారోజుల నిరీక్షణ తరువాత.. అమెరికన్ కార్ల దిగ్గజం టెస్లా భారతదేశంలో 'మోడల్ వై' లాంచ్ చేసింది. అయితే ప్రారంభం నుంచి దీని అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో కార్లన్నీ.. షోరూంలలోనే ఉండిపోవాల్సి వచ్చింది. దీనిని దృష్టిలో ఉంచుకుని సంస్థ.. వీటి అమ్మకాలను మెరుగుపరచడానికి భారీ ఆఫర్ ప్రకటించింది. టెస్లా ఇండియా.. ప్రస్తుతం ఉన్న స్టాక్ అమ్ముకోవడానికి మోడల్ౕ కొనుగోలుపై రూ. 2 లక్షల వరకు తగ్గింపును అందిస్తోంది. ఈ ఆఫర్ స్టీల్త్ గ్రేలో పూర్తిగా నలుపు రంగు ఇంటీరియర్‌తో కూడిన స్టాండర్డ్ రేంజ్ వేరియంట్‌కు పరిమితం చేసినట్లు తెలుస్తోంది. ప్రారంభంలో కంపెనీ 300 మోడల్ వైలను దిగుమతి చేసుకుంది. అయితే ఇప్పటికి కూడా 100 యూనిట్లను కూడా అమ్మలేకపోయింది. టెస్లా అమ్మకాలు కేవలం భారతదేశంలో మాత్రమే కాకుండా.. ప్రపంచంలోని చాలా దేశాల్లో తగ్గుముఖం పట్టాయి. 2025లో కూడా వరుసగా రెండవ సంవత్సరం సేల్స్ తగ్గినట్లు గణాంకాలు పేర్కొన్నాయి. ఇదే సమయంలో చైనా బ్రాండ్ బీవైడీ అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. పెరుగుతున్న పోటీ ఒ కొన్ని కార్ మార్కెట్లలో సబ్సిడీలు తగ్గడం వల్ల అమెరికా, యూరప్, చైనా అంతటా టెస్లా వాటా తగ్గిపోయిందని కొన్ని నివేదికలు చెబుతున్నాయి.

# పల్సర్ బైక్ ప్రియం

న్యూఢిల్లీ: బజాజ్ పల్సర్ కొనుగోలుదారులకు షాకిచ్చింది సంస్థ. పల్సర్ బైకుల ధరలను రూ.461 నుంచి రూ.1,460 వరకు పెంచింది. ఉత్పత్తి వ్యయం పెరగడం వల్లనే ఎంపిక చేసిన పల్సర్ బైకుల ధరలను సవరించినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. కంపెనీ మొత్తం విక్రయాల్లో 60 శాతం వాటా కలిగిన పల్సర్ అమ్మకాలపై ఎలాంటి ప్రభావం చూపదని, సంస్థపై అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా వాహన ధరలను స్వల్పంగా పెంచినట్టు తెలిపారు. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో బజాజ్ పల్సర్ 125 సీసీ బైకు ఎంట్రీ లెవల్ మాడల్ రూ.778 నుంచి రూ.1,020 వరకు సవరించింది. అలాగే నియాన్ సింగిల్ సీటు రకంను రూ.891 పెంచింది.

# ఆంక్షలతో భారత ఓఎంసీలకు రిస్కేమీ లేదు

## వాటి మార్జిన్లపై ప్రభావం ఉండదు

## ఫిచ్ రేటింగ్స్ అంచనాలు




న్యూఢిల్లీ: రష్యన్ ఆయిల్ కంపెనీలైన రోజ్‌నెఫ్ట్, ల్యూక్ ఆయిల్‌పై అమెరికా ఆంక్షలు విధించడం, రష్యా చమురు ఆధారిత రిఫైనరీ ఉత్పత్తులపై ఐరోపా సమాఖ్య (ఈయూ) నిషేధం విధించడం భారత ప్రభుత్వరంగ చమురు సంస్థల మార్జిన్లు, పరపతి సామర్థ్యాలపై పెద్దగా ప్రభావం ఉండదని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. అయితే, ఈ ఆంక్షలు ఎంత కాలం పాటు కొనసాగుతాయి, ఎంత కఠినంగా అవి అమలవుతాయన్న దాని ఆధారంగా తుది ప్రభావం ఆధారపడి ఉంటుందని పేర్కొంది. 2025 జనవరి నుంచి ఆగస్ట్ మధ్య కాలంలో భారత చమురు దిగుమతుల్లో మూడింట ఒక వంతు రష్యా నుంచే ఉండడం గమనార్హం. రష్యా డిస్కౌంట్ రేటుపై చమురును విక్రయించడంతో ప్రభుత్వరంగ చమురు సంస్థల లాభదాయకత గణనీయంగా మెరుగుపడింది. సాధారణంగా మధ్యప్రాచ్య దేశాలపై చమురు దిగుమతుల కోసం భారత్ ఎక్కువగా ఆధారపడేది. కానీ, 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడికి దిగిన తర్వాత ఈ పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో మార్కెట్ ధర కంటే తక్కువకే చమురును రష్యా ఆఫర్ చేయడంతో భారత కంపెనీలు అటువైపు మళ్లాయి. దీంతో భారత చమురు దిగుమతుల్లో అంతకుముందు రష్యా వాటా ఒక శాతంగా ఉంటే, 40 శాతానికి పెరిగింది.

**చమురు ధరలు తక్కువ స్థాయిలోనే..**

ప్రపంచ చమురు ఉత్పత్తి సామర్థ్యం తగినంత ఉండడం ధరలను అదుపులోనే ఉంచుతుందని, బ్రెంట్ బ్యారెల్ ధర 2026లో సగటున 65 డాలర్ల స్థాయిలో ఉండొచ్చని ఫిచ్ రేటింగ్స్ తెలిపంది. 2025లో బ్రెంట్ బ్యారెల్ 70 డాలర్లుగా ఉండడాన్ని ప్రస్తావించింది. ఇక రష్యా చమురు ఆధారిత ఉత్పత్తులను ఈయూకి ఎక్కువగా ఎగుమతి చేస్తున్న భారత్‌లోని ప్రైవేటు చమురు సంస్థలు రిస్క్‌ను ఎదుర్కోవాల్సి రావొచ్చని ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. మూడు ప్రభుత్వరంగ చమురు సంస్థల (ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీ) ఇష్యూయర్ డిఫాల్ట్ రేటింగ్‌లు బలంగా ఉన్నట్టు తెలిపింది. ఎల్‌పీజీ సబ్సిడీల నష్టాన్ని ప్రభుత్వం ప్రకటించిన రూ.30వేల కోట్ల ప్యాకేజీతో గట్టెక్కొచ్చని పేర్కొంది. స్థూల రిఫైనింగ్ మార్జిన్ 2025%-%26లో బ్యారెల్‌కు 6%-%7 డాలర్లు, 2026%-%27లో 6 డాలర్ల స్థాయిలో ఉండొచ్చని అంచనా వేసింది.

# విస్తరణ దిశగా అల్ట్రావయొలెట్



బెంగళూరుకు చెందిన ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్స్ తయారీ సంస్థ అల్ట్రా వయొలెట్ తమ కొత్త యూవీ స్పేస్ స్టేషన్‌ను విజయవాడలో ప్రారంభించింది. ఇందులో ఎక్స్%-%47, ఎఫ్77 మాక్ 2, ఎఫ్77 సూపర్‌స్ట్రీట్ తదితర వాహనాలు అందుబాటులో ఉంటాయి. చూడటానికి స్టైలిష్ డిజైన్ కలిగిన అల్ట్రా వయొలెట్ ఎలక్ట్రిక్ బైకులు.. ఎందుకుని వేరియంట్‌ను బట్టి 2.8 సెకన్లలో గంటకు 60 కి.మీ. వేగాన్ని అందుకోగలవు. ఒక్కసారి చార్జి చేస్తే 323 కి.మీ. వరకు రేంజ్ ఉంటుంది. ఈ బైకులు ప్రస్తుతం దేశీయ విఫణిలో మాత్రమే కాకుండా.. గ్లోబల్ మార్కెట్లో కూడా అమ్మకానికి ఉన్నాయి. ఇవి అత్యుత్తమ పనితీరును అందించడం వల్ల ఎక్కువమంది.. ఈ బైకులను ఇష్టపడి కొనుగోలు చేస్తుంటారు.

# టఫే ఎలక్ట్రిక్ ట్రాక్టర్‌కు గుర్తింపు




జర్మనీలో నిర్వహించిన అగ్రిటెక్నికా 2025లో 'ట్రాక్టర్ ఆఫ్ ది ఇయర్' టాప్ 5 ఫైనలిస్టుల జాబితాలో తమ ఈవీ28 ఎలక్ట్రిక్ ట్రాక్టర్ చోటు దక్కించుకుందని టఫే ట్రాక్టర్స్ వెల్లడించింది. పర్యావరణహిత ట్రాక్టర్ల కేటగిరీలో ఈ గుర్తింపు దక్కించుకున్నట్లు వివరించింది. ఈ సందర్భంగా తమ కొత్త తరం ఎలక్ట్రిక్ హైబ్రిడ్ ట్రాక్టర్ ఈవీఎక్స్75 సహా మూడు ఉత్పత్తులను టఫే ప్రదర్శించింది. యూరోపియన్ రైతుల వైవిధ్యమైన అవసరాల కు ఇవి అనుగుణంగా ఉంటాయని సంస్థ వైస్ చైర్మన్ లక్ష్మీ వేణు తెలిపారు. వీటితో కేవలం ట్రాక్టర్ల తయారీ నుంచి అన్ని రకాల వ్యవసాయ సాధనాలును అందించే సమగ్ర సంస్థగా ఎదిగినట్లవుతుందని వివరించారు. సబ్%-%100 హెచ్‌పీ సెగ్మెంట్‌లో అంతర్జాతీయంగా అగ్రగామిగా ఎదగాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చైర్మన్ మల్లికా శ్రీనివాసన్ చెప్పారు. స్టార్టప్‌లతో కలిసి పనిచేస్తూ ప్రెసిషన్ అగ్‌టెక్, స్మార్ట్ ఫార్మింగ్, ఆటోమేషన్ మొదలైనవాటిపై గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తున్నామని వివరించారు.

# 3 కంపెనీలు రెడీ




## సెబీ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా మూడు కంపెనీల దరఖాస్తులను ఆమోదించింది. ఈ జాబితాలో ఏస్‌వెక్టర్, సిల్వర్ కన్జూమర్ ఎలక్ట్రికల్స్, స్టీల్ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ కంపెనీ చేరాయి. వీటిలో ఏస్‌వెక్టర్ 2025 జూలైలో గోప్యతా మార్గాన సెబీకి దరఖాస్తు చేసింది. సిల్వర్ కన్జూమర్, స్టీల్ ఇన్‌ఫ్రా ఈ ఏడాది ఆగస్ట్‌లో ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. ప్రస్తుత క్యాలండర్ ఏడాది(2025)లో ప్రైమరీ మార్కెట్లు సరికొత్త రికార్డులవైపు పరుగు తీస్తున్నాయి. ఇప్పటికే ఈ ఏడాది 92 కంపెనీలు మెయిన్‌బోర్డులో ఐపీవోకు వచ్చాయి. ఈ బాటలో మరికొన్ని కంపెనీలు ఈ నెలలోనే స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు సిద్ధపడుతున్నాయి. ఈ నేపథ్యంలో మరో 3 కంపెనీలకు సెబీ తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం! వివరాలు చూద్దాం..

**స్నాప్‌డీల్**

కునాల్ భల్, రోహిత్ బన్సల్ ఏర్పాటు చేసిన ఏస్‌వెక్టర్ రహస్య ఫైలింగ్ విధానంలో ఐపీవోకు అనుమతి పొందింది. ఇటీవల ఇదే మార్గంలో పలు దిగ్గజాలు పబ్లిక్ ఇష్యూ వచ్చిన సంగతి తెలిసిందే. కాగా.. ఈకామర్స్ సంస్థ స్నాప్‌డీల్ మాతృ సంస్థ అయిన ఏస్‌వెక్టర్.. సాస్ ప్లాట్‌ఫామ్ యూనికామర్స్‌సహా, కన్జూమర్ బ్రాండ్ బిల్డింగ్ సంస్థ స్టెల్లారో బ్రాండ్స్‌ను నిర్వహిస్తోంది. వీటిలో యూనికామర్స్ 2024లోనే లిస్టయిన సంగతి తెలిసిందే.

**పంపులు, ఫ్యాన్లు**

పబ్లిక్ ఇష్యూ ద్వారా సిల్వర్ కన్జూమర్ ఎలక్ట్రికల్స్ రూ. 1,400 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇందుకు అనుగుణంగా రూ. 1,000 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 400 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 865 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. మరో రూ. 35 కోట్లు అనుబంధ సంస్థ బీఏపీఎల్ రుణాల చెల్లింపులకు వినియోగించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. కంపెనీ ప్రధానంగా పంపులు, మోటార్లు, ఫ్యాన్లు, లైటింగ్ తదితర కన్జూమర్ ఎలక్ట్రికల్ ప్రొడక్టులను తయారు చేస్తోంది.

**విస్తరణపై కన్ను**

స్టీల్ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ ఐపీవోలో భాగంగా రూ. 96 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 1.42 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను వడోదర, హైదరాబాద్, భిలాయ్‌లలోగల తయారీ ప్లాంట్ల విస్తరణతోపాటు.. వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

# ఐటీలో నియామకాలు బ్రేక్

## గత తొమ్మిది నెలల్లో భారీగా పడిపోయిన రిక్రూట్‌మెంట్లు

## ఏఐ, ఆటోమేషన్‌పై ఐటీ దిగ్గజాల దృష్టే కారణం..

న్యూఢిల్లీ: దేశీయ ఐటీ సంస్థలు ఖర్చులను తగ్గించుకోవడానికి ఆపసోపాలు పడుతున్నాయి. ఇప్పటికే నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవడానికి పలు కీలక చర్యలు తీసుకుంటున్న సంస్థలు ..తాజా ఉద్యోగ నియామకాలకు బ్రేక్‌వేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం గడిచిన తొమ్మిది నెలల్లో దేశీయ ఐటీ దిగ్గజాలు నికరంగా 17 మందిని మాత్రమే రిక్రూట్ చేసుకున్నాయి. గతేడాది ఇదే సమయంలో ఐటీ సంస్థలు 17,764 మందిని నియమించుకున్నాయి. టెక్నాలజీ రంగం రూపాంతరం చెందుతున్నదని, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు అనుసంధానం అధికం కావడం ఇందుకు కారణమని తెలిపింది.దీంతో టీసీఎస్ ఏకంగా 25 వేల మంది సిబ్బందిని తొలగించింది. సాంప్రదాయక వృద్ధికి దూరంగా అడుగులు వేస్తున్న ఐటీ సంస్థలౌఉత్పాదకతను పెంచుకోవడానికి పలు కఠిన చర్యలు తీసుకుంటున్నాయి. దీంట్లో భాగంగా ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు టాప్-5 సంస్థలు కేవలం 17 మందిని రిక్రూట్ చేసుకున్నాయి. భవిష్యత్తులో నియామకాలు ఉండకపోవచ్చని హెచ్చరించాయి కూడా. మరోవైపు, ఐటీ రంగంలో సంస్థలు విలీనాలు అధికంగా జరగడం కూడా నియామకాలు తగ్గడానికి ప్రధాన కారణమని విశ్లేషించింది.ప్రధానంగా గణాంకాలు తాత్కాలిక మందగమనాన్ని కాకుండా నిర్మాణాత్మక మార్పును సూచిస్తున్నాయని అమెరికాకు చెందిన హెచ్‌ఎఫ్‌ఆర్ రిసెర్చ్ సీఈవో ఫిల్ ఫర్షేట్ తెలిపారు. ఐటీ సంస్థలు ఖర్చులను తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాయని, క్లయింట్లు కూడా తమ ప్రొడక్ట్‌ను పెంచుకోవడానికి చూస్తున్నాయన్నారు. మరోవైపు, ఏఐ, ఆటోమేషన్‌కు విస్తృతంగా డిమాండ్ నెలకొనడం కూడా రిక్రూట్‌మెంట్లను తగ్గించుకోవడానికి ప్రధాన కారణమన్నారు. ఒక్కో ఉద్యోగిపై లక్ష డాలర్ల కంటే అధికంగా వెచ్చిస్తున్న సంస్థ..దీంట్లో నాలుగో వంతు కూడా డిజిటల్ కోసం ఖర్చు కాకపోవడంతో సంస్థలు వీటి వైపు మొగ్గుచూపుతున్నాయన్నారు. ప్రముఖ టెక్నాలజీ దిగ్గజం విప్రో..ఉద్యోగ నియామకాలను తగ్గించుకునేయోచనలో ఉన్నది.

# ఎఐ మార్ఫింగ్ ఫోటోలతో నష్టం

## ఆందోళన వ్యక్తం చేసిన నటి కీర్తి సురేశ్

తన పేరుతో ఆన్‌లైన్‌లో సర్కులేట్ అవుతున్న ఎఐ మార్ఫింగ్ చిత్రాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా రూపొందించబడిన ఈ నకిలీ ఫోటోలు తనను మానసికంగా బాధిస్తున్నాయని కీర్తి తెలిపింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది.మార్ఫింగ్ చిత్రాలు నా మనసుకి చాలా బాధ కలిగించడమే కాకుండా.. చాలా విసుగు పుట్టిస్తున్నాయి. ఈ కృత్రిమ మేధస్సుతో క్రియేట్ నకిలీ చిత్రాలు ఎంత నమ్మేలా ఉన్నాయంటే వాటిని చూసినప్పుడు నిజంగానే నేను అలా ఫోజు ఇచ్చానా? అని తనకు తాను ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చిందని కీర్తి పేర్కొన్నారు. ఇది ఎఐ సాంకేతికత ఎంత ప్రమాదకరంగా మారిందో తెలియజేస్తుందని కీర్తి తెలిపారు. ఎఐ సాంకేతికత సామర్థ్యాలు నానాటికీ పెరుగుతున్నాయని వీటిని నియంత్రించడం కష్టంగా మారుతోందని కీర్తి సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా తమ ఇమేజ్‌లను దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని. ఈ సమస్య కేవలం సినీ పరిశ్రమకు మాత్రమే పరిమితం కాలేదని సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఉండే ఎవరికైనా ఇది ముప్పగా పరిణమించే అవకాశం ఉందని కీర్తి హెచ్చరించారు. ఇక కీర్తి సురేష్ ఆవేదనకు మద్దతుగా నటి ఆండ్రియా జెరెమియా కూడా ఎఐ వల్ల కలిగే నష్టాల గురించి మాట్లాడారు. నటులకే కాదు, సామాన్య ప్రజలకు కూడా ఎఐ సమస్యగా మారుతోంది. రష్మిక మందన్న, సమంత వంటి పలువురు నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ లేదా మార్ఫింగ్ చిత్రాల బారిన పడ్డారు. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా దీనిపై గళం విప్పడం, ఎఐ దుర్వినియోగం పై మరింత కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.





# మత్తెక్కించేస్తున్న శాలిని పాండే

శాలిని పాండే తరవాత పెద్దగా సినిమాల్లో కనిపించలేదు. బాలీవుడ్‌లో మాత్రం అవకాశాలు దక్కించుకుంటోంది. ఈ మధ్య ఈ అమ్మడు తన ఎక్స్‌పోజింగ్‌తో కుర్రకారును మత్తెక్కిస్తోంది. తాజాగా శాలిని ఫోటోలు హాట్‌హాట్‌గా మారాయి.

# త్రీడీలో చూసి షాక్ అయ్యాను

"కార్తికేయ 2' వంటి పాన్ ఇండియా విజయం తర్వాత అంతకంటే అద్భుతమైన ప్రాజెక్ట్‌తో రావాలని ఇన్ని రోజులు ఆగాను. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ చేసిన సినిమా 'స్వయంభు'. ఈ చిత్రం చూసిన తర్వాత నిఖిల్ మావాడు అని చెప్పడానికి మీరంతా చాలా సంతోషపడతారు" అని నిఖిల్ చె??పారు. నిఖిల్ హీరోగా, సంయుక్త, నభా నటేష్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'స్వయంభు'. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మించారు. ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, చైనీస్, స్పానిష్, అరబిక్ భాషల్లో త్వరలో రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నిఖిల్ మాట్లాడుతూ-- "వెయ్యేళ్ల క్రితం రాయలసీమలోని చిత్తూరు ప్రాంతంలో కృష్ణ అనే యోధుడు ఉండేవారు. అల్లరిగా తిరిగే అండర్ డాగ్ రాజ్యాలను శాసించే స్థాయికి ఆయన ఎలా ఎదిగారు? అనేది మా సినిమాలో చూపించాం. ఈ మూవీని త్రీడీలో చూసినప్పుడు షాక్ అయ్యాను. ప్రేక్షకులు కూడా చాలా ఎంజాయ్ చేస్తారు" అని చె??పారు. భరత్ కృష్ణమాచారి మాట్లాడుతూ-- "ఈ సినిమా అందరికీ గొప్ప అనుభూతినిస్తుంది" అని పేర్కొన్నారు. "ఈ సినిమాలో భాగం కావడం చాలా గర్వంగా ఉంది" అన్నారు కెమెరామేన్ సెంథిల్ కుమార్.







# డబుల్ ధమాకా.. గతంలో బాలయ్య, నాని.. ఇప్పుడు శ్రీవిష్ణు

గతంలో ఒకసారి నందమూరి బాలకృష్ణ నటించిన నిప్పు రవ్వ , బంగారు బుల్లోడు చిత్రాలకు.. మరోసారి హీరో నాని నటించిన ఎవడే సుబ్రహ్మణ్యం, జండాపై కపిరాజు చిత్రాలకు ఇలాంటి సమస్యనే ఎదురైంది. తమ సినిమాల విడుదల విషయం తమ చేతిలో లేకపోవడం. ఒకేసారి రెండు సినిమాలు విడుదల చేయాల్సిన పరిస్థితి రావడం. ఇప్పుడు శ్రీవిష్ణుకి కూడా అదే పరిస్థితి ఎదురైంది. టాలీవుడ్ హీరో శ్రీవిష్ణు ఈ నెల చివర్లో ఓ ప్రత్యేక పరిస్థితిని ఎదుర్కోబోతున్నాడు. తను నటించిన రెండు సినిమాలు ఒకేసారి విడుదల కానున్నాయి. బాలయ్య రెండు చిత్రాలు ఒకేరోజు (1993 సెప్టెంబర్ 3) విడులైయ్యాయి. అలాగే నాని నటించిన రెండు చిత్రాలు 2015 మార్చి 21న విడుదలయ్యాయి. అయితే ఇప్పుడు అదే సీన్ రిపీట్ అయ్యే పరిస్థితి ఏర్పడింది. శ్రీవిష్ణు నటించిన మృత్యుంజయ్ చిత్రాన్ని నెట్‌ఫ్లిక్స్ తీసుకుంది. కానీ స్లాట్ ఈ నెలలోనే ఇచ్చింది. అయితే అదే శ్రీవిష్ణు నటించిన విష్ణు విన్యాసం సినిమాను మరో ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ తీసుకుంది. ఆ సంస్థ కూడా ఇదే నెలకు డేట్ ఇచ్చింది. ఈ విషయంపై చర్చలు జరిగాయి కానీ నో యూజ్. ఇద్దరూ ఒకే తేదీపై పట్టుబడటంతో నిర్మాతలు, హీరో శ్రీవిష్ణు కూడా ఏం చేయలేని పరిస్థితి. రెండు సినిమాలు తనవే కావడంతో, రెండింటినీ సమానంగా ప్రమోట్ చేయాల్సిన బాధ్యత శ్రీవిష్ణుపై పడింది. ఇప్పటికే మృత్యుంజయ్ టీజర్ విడుదలైంది. మరో రెండు రోజుల్లో విష్ణు విన్యాసం టీజర్ కూడా రానుంది. ఆ వారం ఈ రెండు సినిమాలు తప్ప మరే పెద్ద రిలీజ్ లేకపోవడం శ్రీవిష్ణు అదృష్టమే. రెండు సినిమాలు ఒకేసారి రావడం వల్ల ప్రేక్షకులకు డబుల్ ఎంటర్టైన్‌మెంట్ లభించనుంది. అయితే ఏదో ఒకటి ఎడ్జ్ తీసుకునే అవకాశం ఉంది. కానీ కంటెంట్ బలంగా ఉంటే మాత్రం రెండూ హిట్ అయ్యే అవకాశం ఉంది. ఈ పరిస్థితి శ్రీవిష్ణుకు ఒకవైపు ఎంబ్రాసింగ్, మరోవైపు ఎక్సైటింగ్ కూడా. ఎందుకంటే ఒకేసారి రెండు సినిమాలు తనవే అని చెప్పుకోవడం అరుదైన విషయం. చూడాలి మరి చివరికి ఏమౌతుందో. విష్ణు విన్యాసం టీజర్ రిలీజైతే ఈ విషయంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.